



గొల్లపల్లి రిజర్వాయర్‌లో గంగ పూజ చేస్తున్న మంత్రి సవిత

ఉద్యానవనానికి ఊతమిదేనా..?



అనంతపురం జిల్లా అభివృద్ధిలో కీలకం ఉద్యానవన పంటలని ప్రభుత్వం పెద్దఎత్తున చెబుతోంది. అందుకే ఈ జిల్లా ఉద్యానవన హబ్‌గానే కాకుండా ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఇండియాగా మారుస్తామని నేతలు ప్రకటిస్తున్నారు. ఉద్యానవన శాఖ ఈ ఏడాది ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులు చూస్తే 'మాటలు కోటలు దాటుతున్నా.. చేతలు గడపదాటం లేదన్న' నానుడి ఆచరణలో అద్దం పడుతోంది.



రూ.13.03 కోట్లు మంజూరు
విడుదలైంది రూ.1.89 కోట్లు
ఏటా 25 శాతం అభివృద్ధి సాధ్యమా ?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులు రూ.13.03 కోట్లు. ప్రధానంగా మూడు పథకాల కింద ఉద్యానవన శాఖకు నిధులు కేటాయిస్తారు. ఇందులో సమగ్ర ఉద్యానవన అభివృద్ధి పథకం (ఎఐడిహెచ్) కింద రూ.10.41 కోట్లు కేటాయించారు. ఇందులో ఇప్పటి వరకు ఖర్చు చేసింది రూ.1.51 కోట్లు. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన (ఆర్‌కెవివై) కింద కేటాయించింది. రూ.1.58 కోట్లు అయితే ఖర్చు చేసింది సున్నా కావడం గమనార్హం. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన ఆయిల్‌ఫామ్, బాంబూ మిషన్‌కు రూ.1.03 కోట్లు కేటాయించి ఖర్చు చేసింది రూ.37.81 లక్షలు. ఈ మూడు పథకాలకు కలిపి అనంతపురం జిల్లాకు ఈ ఆర్థిక సంవత్సరంలో కేటాయించిన నిధులు రూ.13.03 కోట్లు, ఇందులో ఇప్పటి వరకు ఖర్చు పెట్టిన నిధులు చూస్తే రూ.1.89 కోట్లు మాత్రమే. కేటాయించిన దాంట్లో ఇప్పటి వరకు ఖర్చు చేసిన నిధులు కేవలం 5.5 శాతం నిధులు మాత్రమే కావడం గమనార్హం. మరో మాసంతో ఈ ఆర్థిక సంవత్సరమే ముగియనుంది. ఒక్క నెలలోపు తక్కిన నిధులు కేటాయించడం, వినియోగించడం ఏ మేరకు సాధ్యమన్నది చూడాల్సి ఉంది.

డ్రిప్‌దీ అదే పరిస్థితి

ఉద్యానవన పంటల అభివృద్ధిలో డ్రిప్ కీలకమైంది. ఇదైనా లక్ష్యానికి అనుగుణంగా నడుస్తోందా అంటే అదీ లేకుండా ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 37,500 హెక్టార్లకు అనుమతి వచ్చింది. దీని కోసం ఇప్పటి వరకు 39,170 మంది రైతులు దరఖాస్తులు చేసుకున్నారు. దీని విస్తీర్ణంలో చూసినప్పుడు 52,736 హెక్టార్లలో డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ఆమోదం తెలిపిన వరకే చూస్తే 20,530 రైతులకు సంబంధించి 24,980 హెక్టార్లకు ఇచ్చారు. ఇప్పటి వరకు మంజూరైనవి చూస్తే 9392 హెక్టార్లకే ఉంది. ఇంకా పెద్దఎత్తున జరగాల్సి ఉంది.



25 శాతం వృద్ధి సాధ్యమేనా ?

అనంతపురం జిల్లాలో ఏటా 25 శాతం ఉద్యానవన పరిధిలో అభివృద్ధి సాధిస్తామని ఇటీవల అనంతపురం నగరంలో నిర్వహించిన హార్టికల్చర్ కాంక్లేవ్‌లో జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ ప్రకటించారు. ఇప్పుడు ఏటా వస్తున్న దిగుబడులు 25 లక్షల టన్నులను 29 లక్షల టన్నుల దిగుబడి తీసుకెళుతామని ప్రకటించారు. రైతుకు ఊతమందకుండా 25 శాతం వృద్ధి ఎలా సాధ్యమని రైతు సంఘాల నాయకులు ప్రశ్నిస్తున్నారు. ప్రధానంగా మార్కెటింగ్ సౌకర్యం లేకుండా విస్తరణ ఎలా సాధ్యమని అడుగుతున్నారు. మార్కెటింగు మౌలిక సదుపాయల కల్పనకు ఈ ఏడాది జిల్లాకు కేటాయించిన రూ.1.42 కోట్లలో ఒక్క రూపాయి నిధులను కూడా ప్రభుత్వం మంజూరు చేయలేదు. ఇప్పటికే ఉద్యానవన పంటలను పండించిన రైతులు పంటను అమ్ముకోలేని పరిస్థితులున్నాయి. తాజాగా మిరప రైతు ధరలేక గగ్గోలు పెడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యావన పంటలను ప్రోత్సహిస్తామన్న దానిలో వాస్తవికత ఎంతన్న ప్రశ్నలు రైతుల నుంచి ఉత్పన్నమవుతున్నాయి.

గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి

సాగు,తాగునీటిని అందిస్తాం

- ◆రాయలసీమను సస్యశ్యామలం చేయడమే లక్ష్యం
- ◆వైసిపి పాలనలో సాగునీటి ప్రాజెక్టులు నిర్వీర్యం
- ◆రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

గొల్లపల్లి రిజర్వాయర్ ద్వారా నీటిని విడుదల చేసి పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల ప్రజలు, రైతులకు సాగు, తాగునీటిని అందిస్తామని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ మండలం గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తి స్థాయిలో నీటితో నిండిన నేపథ్యంలో బుధవారం నాడు జల హారతి కార్యక్రమం నిర్వహించారు. మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్ని గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి చెరువులకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడూతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హయాంలోనే గొల్లపల్లి రిజర్వాయర్ పూర్తయ్యిందన్నారు. రెండేళ్ల తర్వాత ఈ రిజర్వాయర్ పూర్తి సామర్థ్యంతో నిండడంతో కిందనున్న చెరువులకు నీటిని విడుదల చేస్తున్నట్లు చెప్పారు. 1.90 టిఎంసిల నీటి సామర్థ్యం కలిగిన గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల పరిధిలో 265 చెరువులు నింపుతున్నామని మంత్రి తెలిపారు. ఈ చెరువుల ద్వారా 42,772 ఎకరాలకు నీరందిస్తున్నామని చెప్పారు. గొల్లపల్లి రిజర్వాయర్ నిర్మించడంతో పెనుకొండ, హిందూపురం, మడకశిర నియోజకవర్గాల్లో తాగునీటి కష్టాలు తీరాయని తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో కియా సహా పలు పరిశ్రమలకు గొల్లపల్లి రిజర్వాయర్ నుంచి నీరందిస్తున్నమని, తద్వారా ప్రత్యక్షంగా వేల మందికి, పరోక్షంగా లక్షల మందికి ఉపాధి లభిస్తోందన్నారు. వైసిపి అధికారంలో ఉనన్ని రోజులూ జగన్మోహన్‌రెడ్డి సాగునీటి ప్రాజెక్టులను పట్టించుకోలేదని విమర్శించారు. రాష్ట్రంలో వైసీపీ శకం ముగిసిందన్నారు. జగన్ లండన్ వెళ్లి వచ్చిన తర్వాత ఆయన మైండ్ దొబ్బిందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసిలు నారాయణస్వామి, మునిమడుగు వెంకట రాముడు, మాజీ ఎంపీపీ కేశవయ్య, లక్ష్మీనారాయణ రెడ్డి, బోయ రామకృష్ణ, పోతిరెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ సిద్దయ్య, పట్టణ కన్వీనర్ శ్రీరాములు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

'పురం' అభివృద్ధికి ప్రణాళికలు

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

హిందూపురం నియోజకవర్గ అభివద్ధి, ఆర్థిక పురోగతికి సంబంధించిన ప్రణాళికలు తయారు చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో హిందూపురం నియోజకవర్గ విజన్ ప్రణాళిక పనులపై పిజిఆర్‌ఎస్, హౌసింగ్ లేఅవుట్లు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల అభివద్ధి ప్రణాళికలు, వివిధ పాఠశాలల విలీనం తదితర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో ఉన్న వనరులను దష్టిలో పెట్టుకుని ఐదు సంవత్సరాల్లో నియోజకవర్గ అభివద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలను సమన్వయం చేసుకుని సమస్యలు పరిష్కరించాలన్నారు. స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికకు తగు డేటాను రూపొందించుకోవాలన్నారు. వ్యవసాయ అనుబంధ, పారిశ్రామిక, సేవ, పర్యాటక రంగాల అభివృద్ధికి కార్య చరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలన్నారు. వృద్ధిరేటు 15 శాతం సాధించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. టిట్కో గహాలతో పాటు ఇతర గృహ నిర్మాణాల కోసం శనివారంలోపు ఎంత భూమి అవసరం, లబ్ధిదారులు ఎందరు అనే డేటా ఇవ్వాలని హౌసింగ్ పీడీని ఆదేశించారు. ఇళ్ల నిర్మాణానికి భూ సేకరణ కోసం ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను పరిష్కరించాలన్నారు. పింఛన్ల పంపిణీలో ఎటువంటి ఫిర్యాదులు రాకుండా అధికారులు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఒ విజయ్ కుమార్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, హిందూపురం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, డిఇఒ క్రిష్టప్ప, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, ఎంపీడీవోలు నరసింహమూర్తి, శివకుమార్, రమణమూర్తి, లేపాక్షి, హిందూపురం, చిలమత్తూరు తహశీల్దారులు సౌజన్య లక్ష్మి సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పర్యాటక రంగానికి నిధులు కేటాయించాలి : ఎంపీ

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పర్యాటక రంగానికి కావాల్సిన నిధులను కేటాయించాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రిని హిందూపురం ఎంపీ బికె.పార్థసారథి కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను ఆయన ఛాంబర్ లో కలిసి సత్యసాయిజిల్లాలో ఉన్న శిల్ప చిత్ర కళల నిలయం లేపాక్షి, రాయలు ఏలిన రెండవ రాజధాని పెనుకొండ , కదిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం, ఆధ్యాత్మిక కేంద్రం పుట్టపర్తి, పట్టుచీరలకు నిలయం ధర్మవరం, విదేశీ పక్షుల విడిది వీరాపురం, నిమ్మలకుంట తోలుబొమ్మలు, కటారుపల్లి యోగివేమన సమాధి, గిన్నిస్ బుక్ వరల్డ్ రికార్డు తిమ్మమ్మ మర్రిమాను వంటి పర్యాటక ప్రదేశాల గురించి వివరించారు. పర్యాటక రంగానికి కావాల్సిన నిధులను కేటాయించాలని కోరారు. తన విన్నపానికి కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించాలని ఈ సందర్భంగా ఎంపీ పార్థసారథి తెలిపారు.

ప్రతి రైతూ ఐడిని నమోదు చేసుకోవాలి

ప్రజాశక్తి - కొత్తచెరువు

మండల వ్యాప్తంగా రైతు సేవ కేంద్రాలలో రైతులు తమ గుర్తింపు కార్డులు చేయించుకోవాలని వ్యవసాయ అధికారి ఎం నటరాజు తెలిపారు. ప్రతి రైతు 11 అంకెల ప్రత్యేక విశిష్ట గుర్తింపు సంఖ్య యూనిక్ ఐడి ఆధార్ కార్డు తరహాలో కేంద్ర ప్రభుత్వం అందిస్తుందన్నారు. కావున తప్పనిసరిగా వీటిని తీయించుకోవాలని కోరారు. వ్యవసాయాన్ని పూర్తిగా ఆధునికరణ చేసుకోవడానికి ప్రభుత్వం ఈ విశిష్ట గుర్తింపు ఇవ్వనుందని చెప్పారు. పాసు పుస్తకం జిరాక్స్, ఆధార్ జిరాక్స్ తీసుకొని వెళ్లాలని తెలిపారు. తప్పనిసరిగా ఆధార్ నెంబరుకు లింక్ అయిన మొబైల్ ను తీసుకెళ్లాలని కోరారు.

బత్తలపల్లి : భూమి కలిగిన ప్రతి రైతు ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాలలో విశిష్ట సంఖ్య నమోదు చేయించుకోవాలని బత్తలపల్లి వ్యవసాయ అధికారి ఓబిరెడ్డి పేర్కొన్నారు.బుధవారం బత్తలపల్లి వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ(వ్యవసాయ రంగాన్ని పూర్తిగా ఆధునీకరణ (డిజిటలైజేషన్) చేయుటకు కేంద్ర ప్రభుత్వం రైతులకు 14 అంకెల ప్రత్యేక విశిష్ఠ గుర్తింపు సంఖ్య (యూనిక్ ఐడి) ఆధార్ కార్డ్ తరహాలో రైతులకు అందించనుందన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలన్నారు.

ఉపాధి పనులను వేగవంతం చేయాలి : పీడీ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

డివిజన్ లోని ఆరు మండలాల్లో ఉపాధి పనులను వేగవంతం చేయాలని డ్వామా పీడీ విజయప్రసాద్ సూచించారు. బుధవారం ధర్మవరం డ్వామా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి మండలంలో ఉపాధి పనులను వేగవంతం చేయాలని, గ్రామాల్లో ఇంతకు ముందు మంజూరు చేసిన పశువులు, గొర్రెలు షెడ్లను తక్షణమే పూర్తి చేసి లబ్ధిదారులుకు ఇవ్వాలని తెలిపారు. ఉపాధి కూలీలకు కావలసిన సదుపాయాలు కల్పించాలని సిబ్బందికి సూచనలు చేశారు, ఈ కార్యక్రమంలో ఎపిడి వెంకటాచలపతి, హార్టికల్చర్ సూపర్ వైజర్ శంకర్, ఎపిఒ అనిల్ కుమార్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

విఆర్‌ఎపై దాడి

పోలీసులకు ఫిర్యాదు

ప్రజాశక్తి - ఓబుళదేవర చెరువు

మండల పరిధిలోని తిప్పేపల్లి విఆర్‌ఎపై దాడి జరిగింది. మండలంలోని ఉంట్ల వారి పల్లి కి చెందిన సర్వేనెంబర్ 401-3,403-6 పొలానికి సంబంధించి ఆర్డీవో నుంచి వచ్చిన నోటీసు అందజేసేందుకు వెళ్లిన తనపై గ్రామానికి చెందిన కొండన్న కుమారులు సూర్యనారాయణ, చంద్రశేఖర్, కొండన్న మనవళ్లు తనపై దాడి చేశారని విఆర్‌ఎ కొండప్ప తెలిపారు. ప్రభుత్వ పని మీద వెళ్లిన తనపై ఉద్దేశపూర్వకంగా దాడి చేశారని, పొలంలోకి అడుగుపెడితే చంపుతామని బెదిరిస్తున్నారని వారి నుంచి నాకు రక్షణ కల్పించాలని కొండప్ప కోరారు. తనపై జరిగిన దాడికి ఎస్ఐ మల్లికార్జున్ రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

'సప్తగిరి'లో ప్రాంగణ నియామకాలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పట్టణంలోని సప్తగిరి కళాశాలలో ఎంబీఏ, ఎంసిఎ విభాగాల ఆధ్వర్యంలో బుధవారం ప్రాంగణ నియామకాలు జరిగాయి. ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరెడ్డి, రీమిక్స్ కంపెనీ నిర్వాహకులు అభ్యర్థులకు ఇంటర్వ్యూ నిర్వహించారు. ఈ ఇంటర్వ్యూలకు 127 మంది అభ్యర్థులు హాజరయ్యారు. హాజరైన అభ్యర్థులకు రాత పరీక్ష నిర్వహించిన అనంతరం మౌఖిక పరీక్ష నిర్వహించారు. 11 మంది అభ్యర్థులను సంబంధిత కంపెనీ ప్రతినిధులు ఉద్యోగాల కోసం ఎంపిక చేశారు. ఎంపికైన అభ్యర్థులు బెంగళూరు కేంద్రంగా ఏడాదికి రూ.3.60 లక్షల వేతనంతో ఉద్యోగం చేయాల్సి ఉంటుందన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ పల్లె వెంకటకృష్ణ కిషోర్, ప్రిన్సిపల్ డాక్టర్ నారాయణరెడ్డి, ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపల్ మంజునాథ్, ప్లేస్మెంట్ ఆఫీసర్ బాబా ఫక్రుద్దీన్, పరిపాలనాధికారి గంగిరెడ్డి తదితరులు అభినందించారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ధర్మవరం విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

మండల పరిధిలోని నాగలూరు గ్రామం వద్ద ఉన్న రూపా రాజా పీసీఎంఆర్ పాఠశాలలో మూడవ తరగతి చదువుతున్న విద్యార్థిని ఉషశ్రీ రాష్ట్రస్థాయి వేదిక్ మాథ్స్ పోటీలలో ప్రతిభ కనబరచిందని ఆ పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ తెలియజేశారు. తమ పాఠశాలలో చదువుతోపాటు వివిధ పోటీ పరీక్షలు కూడా నిర్వహిస్తూ విద్యార్థులకు తీర్చిదిద్దుతునానమని తెలిపారు. విశ్వం ఎడిటేక్ ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన స్టార్ జూనియర్ లెవెల్ 3 రాష్ట్రస్థాయి వేదిక్ మాథ్స్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థి ఉషశ్రీ పాల్గొని తృతీయ స్థానాన్ని సాధించిందన్నారు. చైర్మన్ హర్షవర్ధన్ తో పాటు డైరెక్టర్లు రూపా రాధాకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్ రెడ్డి, ప్రిన్సిపల్ నరేష్ కుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు, పాఠశాల విద్యార్థులు ప్రతిభా విద్యార్థిని అభినందించారు.

బళ్లారి-గుండ్లపల్లి రోడ్డును

జాతీయ రహదారిగా మార్చండి

కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ కార్యదర్శికి ఎంపిలు, విప్ వినతి



వినతిపత్రం అందిస్తున్న ఎంపీలు, విప్

ప్రజాశక్తి-రాయదుర్గం

బళ్లారి-ఎన్.గుండ్లపల్లి ప్రధాన రోడ్డును జాతీయ రహదారిగా గుర్తిస్తూ అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం ఎంపిలు అంబికా లక్ష్మీనారాయణ, బికె.పార్థసారథి, రాష్ట్ర ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు ఢిల్లీలోని కేంద్ర రవాణా శాఖ కార్యాలయంలో కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ కార్యదర్శి ఉమాశంకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ కర్నాటక, ఆంధ్ర ప్రాంతాలను కలిపే 52 కిలోమీటర్ల పొడవైన ఈ అంతర్రాష్ట్ర రహదారిని జాతీయ రహదారిగా గుర్తిస్తూ ఉత్తర్వులు ఇవ్వాలని విన్నవించారు. అలాగే 150-ఎ జాతీయ రహదారిపై డి.హీరేహాల్‌లో బ్రిడ్జి నిర్మాణంపై స్థానికులు అభ్యంతరం చెపుతున్నారని ప్రజల వినతి మేరకు బాక్స్ బ్రిడ్జి బదులు ఫ్లై ఓవర్ నిర్మించేలా డిజైన్‌లో మార్పు చేయాలని కోరారు. రెండు సమస్యలకు త్వరలో తప్పక పరిష్కారం లభిస్తుందని కాలవ శ్రీనివాసులు ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి - పరిగి



ఫ్రీ కాట్ మిల్లు గేటు వద్ద కార్మికులు

మండలంలోని కొడిగేనహళ్ళి ఫ్రీ కాట్ బి మిల్లులో 10 సంవత్సరాలుగా పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను యాజమాన్యం తొలగించడం అన్యాయమని బాధిత కార్మికులు వాపోయారు. పది సంవత్సరాలుగా మిల్లులో కార్మికులుగా పనిచేస్తూ జీవనోపాధి పొందుతున్నామనిఎటువంటి నోటీసు ఇవ్వకుండా యాజమాన్యం తొలగింపునకు సిద్ధమవడం సబబు కాదన్నారు. తమకు రావలసిన బెనిఫిట్లను యాజమాన్యాన్ని అడిగినందుకు తమపై కక్ష సాధింపు చర్యగా తొలగించారని విమర్శించారు. తమను విధుల్లోకి తీసుకునే వరకు తమ ఆందోళన కొనసాగిస్తామని చెప్పారు. సోమవారం నుండి పనిలోకి యాజమాన్యం రానివ్వడం లేదన్నారు. తమకు రావాల్సిన వేతనాలతో పాటు న్యాయం జరిగే విధంగా లేబర్ అధికారులు చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు : ఎంపిపి

ప్రజాశక్తి ముదిగుబ్బ



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిపి

మండలంలో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని ఎంపిపి ఆదినారాయణ యాదవ్ ఆదేశించారు. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయలో బుధవారం నిర్వహించిన సమావేశంలో తాగునీటి సమస్యపై సమీక్షించారు. మండల కేంద్రంలో తాగునీరు 20 రోజుల ఒక్కసారి వస్తున్నాయని అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ముదిగుబ్బలో దాదాపు 32 బోర్లు మరియు చేతి పంపులు 24 వున్నప్పటికి నీటి ఎద్దడి తీవ్రంగా ఉందన్నారు. సమస్య పరిష్కారానికి మండల, పంచాయతీ గ్రాంట్‌లోని నిధులను ఉపయోగించుకోవాలని సూచించారు. 8 రోజుల్లోగా సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమములో ఎంపిడిఒ దివాకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ ప్రసాద్, గ్రేడ్ 1 పంచాయితి సేకరెట్రి మంజుల , ఇంజనీరింగ్ ఎఇ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలి

డీఎస్పీ విజయ్ కుమార్

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితుల సమస్యలను సానుకూలంగా పరిష్కరించాలని చట్టపరంగా తగు చర్యలు తీసుకోవాలని డిఎస్‌పి విజయ్ కుమార్ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు ఆయన బుధవారం పట్టణ పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఉమెన్ హెల్ప్ డెస్క్ పరిశీలించిన ఆయన అక్కడ ఉన్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్ కు వెళితే తమ సమస్యలు పరిష్కారం అవుతాయని నమ్మకంతో బాధితులు వస్తుంటారని ఇరువు వర్గాలను విచారించి స్టేషన్ పరిధిలో పరిష్కారం అయ్యే సమస్యలను పరిష్కరించాలని సిబ్బందికి సూచించారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది తమ విధి నిర్వహణలో చిత్తశుద్ధితో పనిచేస్తే నేరాలను అదుపులోకి తీసుకురావచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సిఐలు సునీత, ప్రవీణ్, ఎస్ఐ శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.



పోలీసు అధికారులతో మాట్లాడుతున్న డీఎస్పీ

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - మడకశిర

బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత అని సిడిపిఒ నాగమల్లేశ్వరి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని గుండుమల గ్రామంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాల నందు ఆర్‌డిటి, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ (ఐ సి డి ఎస్) ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాగ మల్లేశ్వరి బాలల హక్కులు, వాటి పరిరక్షణ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిటి మడకశిర ఏరియా టీం లీడర్ రఘురాం, మహిళా అభివద్ధి విభాగం టీం లీడర్ ఆదినారాయణ,కళాశాల ప్రిన్సిపల్ రాధాకృష్ణ, కళాశాల సిబ్బంది మద్దిలేటి, వైద్య సిబ్బంది ఆశాలత, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

రొద్దం : మండలంలో బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేద్దామని ఎంపిడిఒ రామ్‌కుమార్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం గ్రామ స్థాయి సిఎంపిఒ(బాల్య వివాహాల నిషేధ అధికారులు)లకు రివ్వు మీటింగ్ నిర్వహించారు. ఈ సమావేశానికి తహశీల్దార్ ఉదయ్ శంకర్ రాజ్, ఈవోఆర్డీ గోవిందప్ప, ఎంఇఒ జయభాస్కర్, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు సుజాత, అనురాధ హాజరయ్యారు. ఈసందర్భంగా అధికారులు మాట్లాడుతూ గ్రామాల్లో బాల్యవివాహల నిర్మూలనకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామ స్థాయిలో సమస్యలు వచ్చినప్పుడు మండలస్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, విఆర్‌ఒలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి - నంబులపూలకుంట

రైతులు తమ పంటల సాగులో యజమాన్య పద్ధతులు పాటించాలని ఉద్యానవన శాఖ అధికారి ప్రతాపరెడ్డి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని మేకల చెరువు, ఎదురుదొన తదితర గ్రామాలలో మామిడి, సపోటా, నేరేడు పంటలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అగ్రికల్చర్ అధికారి లోకేశ్వర్ రెడ్డి, హరినాథ్ రెడ్డి, బాషాతో పాటు పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జట్టుకు అభినందన

ప్రజాశక్తి-హిందూపురం

ఈ నెల 10వ తేదీన అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో ముగిసిన "ఖేలో ఇండియా అస్మిత అండర్-13 బాలికల ఫుట్ బాల్ పోటీలలో హిందూపురం అండర్ 13 బాలికల ఫుట్ బాల్ జట్టు విజేతగా నిలిచింది. ఈ మేరకు ఛాంపియన్ గా నిలిచిన జట్టును బుధవారం పట్టణంలోని ఎంజిఎం పాఠశాల ఆవరణంలో శ్రీ సత్యసాయి జిల్లా, హిందూపురం ఫుట్ బాల్ అసోసియేషన్ ప్రెసిడెంట్ జేవీ అనిల్ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఎస్ శేఖర్, సెక్రటరీ బి కే మహమ్మద్ సలీం, ఈసీ మెంబర్ ఆజాద్, కోచ్ విజయవాణి, పీడీలు లోకనాథ్, భాస్కర్, భాస్కర్ హరి అభినందించారు.

బడిబస్సులు నడపండి

ప్రజాశక్తి - మడకశిర రూరల్

మండలంలోని వివిధ గ్రామాలకు బడిబస్సులు నడపాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. బస్సు సౌకర్యం లేకనే తాము తప్పనిసరి పరిస్థితుల్లో తమ పిల్లలను ఆటోల్లో పంపిస్తున్నామన్నారు. మంగళవారం సాయంత్రం మడకశిర నుండి విద్యార్థులు పరిమితికి మించి ఆటోలో విద్యార్థులను తీసుకెళుతుండటాన్ని స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు గమనించి ఆటోను ఆపి తన సొంత వాహనంలో విద్యార్థులను వారి ఇళ్లకు పంపించారు. ఎమ్మెల్యే చర్యపై విద్యార్థులు తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. రవాణా సౌకర్యం పై విద్యార్థులు తల్లిదండ్రులు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రతి గ్రామపంచాయతీ నుండి మండల కేంద్రానికి విద్యార్థి బస్సును నడిపే విధంగా రవాణా శాఖ వారితో మాట్లాడి ఏర్పాటు చేయాలని వారు కోరుతున్నారు.

పొలం పిలుస్తోంది

లేపాక్షి : మండలంలోని కంచి సముద్రం, మైదుగోళం గ్రామాల్లో వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎఒ శ్రీ లత మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన రైతు విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదును రైతులు చేసుకోవాలన్నారు. ఈసందర్భంగా రాగి పంట సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎఇఒ పుష్ప , సచివాలయం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బత్తలపల్లి : వేరుశనగలో వ్యాపించిన చీడపీడల నివారణకు వ్యవసాయ శాఖ సూచించే నివారణ చర్యలు పాటించాలని కదిరి వ్యవసాయ పరిశోధన స్థానం తెగుళ్ళ శాస్త్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బి.వి భాస్కర్ రెడ్డి,డాక్టర్ ఆర్ నరసింహులు,డాక్టర్ ఎం రమేష్ నాయక్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పోట్లమర్రి గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమానికి హాజరైన వారు మాట్లాడుతూ వేరుశనగలోని సమగ్ర యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి ఓబిరెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి ఉపేంద్ర రెడ్డి, విఎస్ఎ ముత్యాలప్ప, రైతులు పాల్గొన్నారు.

16న హాకీ జట్టు ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - ధర్మవరం

పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఈనెల 16న జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షులు, శ్రీ సత్య సాయి జిల్లా హాకీఅసోసియేషన్ కార్యదర్శి బంధనాదం సూర్య ప్రకాష్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపికైన సీనియర్ పురుషుల జట్టు హాకీ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో 2025-మార్చి నెలలో గుంటూరులో జరిగే 15వ రాష్ట్రస్థాయి సీనియర్ హాకీ పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. ఈ ఎంపిక పోటీల్లో పాల్గొని సీనియర్ క్రీడాకారులు తమ వెంట ఆధార్ కార్డు బర్త్ సర్టిఫికెట్ తీసుకొని రావాలని తెలిపారు.

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని సడ్లపల్లి ఎన్టీఆర్ కాలనీలోనిప్రభుత్వ పాఠశాలలో మనబడి-మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ఎంఇఒ గంగప్ప, వార్డు కౌన్సిలర్ సునీత బుధవారం ప్రారంభించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, స్థానికులు లింగారెడ్డి, రామప్ప, బసప్ప, మణిప్రియ, గోపాల్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మరథోత్సవం

ప్రజాశక్తి - మడకశిర

పట్టణంలోని మిట్టబండ ఆంజనేయ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రథోత్సవం వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు. ఈసందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ రథోత్సవానికి చుట్టుప్రక్కల గ్రామాల నుండి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు

హిందూపురం : హిందూపురం పట్టణంలో పేట వెంకటరమణ స్వామి బ్రహ్మ రథోత్సవం బుధవారం కన్నుల పండువగా జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహజంచారు. మధ్యాహ్నం ఉత్సవ విగ్రహాలను రథంలో ఉంచి లాగారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డి ఈ రమేష్ కుమార్, టిడిపి జిల్లా అధ్యక్షులు కొల్లకుంట అంజినప్ప, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త దీపికా వేణురెడ్డిలతో పాటు ఆయా పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అవినీతి ఆరోపణలపై గుట్టుగా విచారణ



కార్యాలయం గది బయట వేచి ఉన్న అధికారులు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం వాణిజ్య పనుల శాఖ కార్యాలయంలో భారీ అవినీతి జరిగిందన్న ఆరోపణలపై జేసీ ఆదేశాల మేరకు బుధవారం నిర్వహించిన విచారణ గుట్టుచప్పుడు కాకుండా నిర్వహించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసిస్టెంట్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న కృష్ణవేణి భారీగా అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలున్నాయి. ఈనేపథ్యంలో కొంతమంది డీలర్లుఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో జాయింట్ కలెక్టర్ సూచనల మేరకు వాణిజ్య పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ శేషాద్రి విచారణ అధికారిగా డిప్యూటీ కమిషనర్ మురళి మనోహర్ ను నియమించారు. దీంతో ఆయన బుధవారం విచారణ నిమిత్తం హిందూపురం వచ్చారు. అయితే ఈ విషయాన్ని స్థానిక వాణిజ్య పన్నుల శాఖ అధికారులు బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. సమాచారం తెలియడంతో మీడియా ప్రతినిధులు కార్యాలయానికి వెళ్లి అసిస్టెంట్ కమిషనర్ ను కలిసి విచారణ అధికారి వివరాలు ఇవ్వాలని కోరారు. అయితే ఆయన రాలేదని తెలిపారు. కాని విచారణ అధికారి ఉదయం నుంచి ఫిర్యాదులు చేసిన వారిని రహస్యంగా కలిసినట్లు తెలిసింది. మధ్యాహ్నం విచారణ అధికారి కార్యాలయనికి వచ్చిన విషయం తెలుసుకున్న మీడియా ప్రతినిధులు అయన్ను కలవడానికి కార్యాలయానికి వెళ్లారు. విచారణ అధికారి మురళి మనోహర్ మూడు నిమిషాలు మాట్లాడడానికి రెండు గంటలసేపు సమయం పట్టింది. అధికారులతో రహస్యంగా రెండు గంటలసేపు చర్చించారు. అనంతరం మీడియా ప్రతినిధులను లోపలికి పిలిచారు. కార్యాలయంలో ఎటువంటి అవినీతి జరగలేదదనిఫిర్యాదులు చేసిన డీలర్ల చిరునామాకు వెళ్లి పరిశీలిస్తే అక్కడ వారు ఎవరూ లేరని, నిరాధారణ ఆరోపణలని కొట్టి పారేశారు. అయినప్పటికీ కార్యాలయంలో ఉన్న అధికారులను ఒక్కొక్కరిగా విచారణ చేస్తున్నామని, మరి కొంతమందిని అనంతపురం పిలిపించి విచారణ చేస్తామని తెలిపారు. అయితే ఎటువంటి అవినీతి జరగకపోతే గంటల తరబడి రహస్యంగా అధికారులను విచారణ చేయాల్సిన అవసరం ఏముందన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతిని కప్పిపుచ్చడానికి విచారణ అధికారి ప్రయత్నం చేస్తున్నట్లు ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

అంబేద్కర్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి- పరిగి



జెసిబితో కంపలు తొలగిస్తున్న దృశ్యం

మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో ఆ స్థలాన్ని అంబేద్కర్ భవన నిర్మాణానికి కేటాయించాలని ఇటీవలే దళిత సంఘాలు సోషల్ వెల్ఫేర్ డిడి ని కోరగా ఆయన అంగీకరించారు. అంతేకాకుండా రెవెన్యూ అధికారుల సైతం ఈ స్థలాన్ని అంబేద్కర్ భవన నిర్మాణానికి ఇవ్వడంతో బుధవారం స్థానిక దళిత నాయకులు స్థలంలో ముళ్లకంపలు తొలగించారు. ఈ స్థలంలో అంబేద్కర్ భవన నిర్మాణానికి ఎంపీ పార్థసారథి సైతం ముందుకు వచ్చి నిధులు ఇవ్వడానికి సుముఖత వ్యక్తం చేశారని త్వరలో భూమి పూజ నిర్వహించనున్నామని దళిత నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి శ్రీరాములు. మాజీ ఎంపీపీ గోవిందప్ప, మాజీ సర్పంచి నాగరాజు, ఎస్సీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రామాంజి, శివశంకర్, డిఎస్ఎల్ శ్రీనివాసులు, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

'పది' పరీక్షల్లో మొదటి స్థానంలో నిలవాలి

ప్రజాశక్తి - మడకశిర



అధికారులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ

త్వరలో జరగబోయే పదవ తరగతి ఫలితాల్లో జిల్లాలోనే నియోజకవర్గాన్ని మొదటి స్థానంలో నిలపాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి తెలిపారు. పట్టణంలోని రహదారులు విశ్రాంతిభవనంలో బుధవారం నియోజకవర్గంలోని అన్ని మండలాల మండల విద్యాధికారులతో సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు మంచి విద్యను బోధించే విధంగా చూడాలని ఉత్తీర్ణత శాతం పెంచాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి వాటిని పునర్నిర్మించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని విద్య శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, శ్రీనివాస భాస్కర్, నరసింహమూర్తి, శ్రీధర్, మండల కన్వీనర్లు మద్దనకుంటప్ప, లక్ష్మీనారాయణ, గణేష్, ప్రధాన కార్యదర్శి రంగే గౌడ్, క్లస్టర్ ఇన్‌ఛార్జి బీమ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మలకుంట తోలుబొమ్మలాట కళాకారుడికి సత్కారం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

మండల పరిధిలోని నిమ్మలకుంట గ్రామానికి చెందిన తోలుబొమ్మలాట కళాకారుడు, గురువు షిండే చిదంబర రావుకు ఇటీవల బొంబాయిలో ఘన సత్కారం లభించింది. ఈ సందర్భంగా చిదంబరం మాట్లాడుతూ ఇటీవల బొంబాయి లోని కేటీ ఏరియాలో మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి తోలుబొమ్మలాట కళాకారుల ప్రదర్శన నిర్వహించారన్నారు. ఈ ప్రదర్శనలో తనతో పాటు 8మంది కళాకారులు తోలు బొమ్మల ప్రదర్శనను నిర్వహించామన్నారు. ఆంధ్రప్రదేశ్ తరఫున ప్రదర్శించిన తమ తోలుబొమ్మలాట అందరిని విశేషంగా ఆకట్టుకుందని తెలిపారు. తాను 48 సంవత్సరాలుగా తోలుబొమ్మలాట కళాకారుడుగా, గురువుగా ఉంటున్నానని చెప్పారు. భారత దేశంతో పాటు ఇతర దేశాలైన లండన్, జర్మనీ, స్పెయిన్, ఈజిప్ట్, మెక్సికో, ప్యారిస్, ఫ్రాన్స్, ఉమెన్ మస్కట్ దేశాలలో ప్రదర్శన నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. ప్రధాని మోడీతో కూడా తాను ప్రశంసలు అందుకున్నానని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కూడా కళాకారులను మరింత ఆదుకునే దిశలో చర్యలు చేపట్టాలని తెలిపారు.



మెమొంటో అందుకుంటున్న చితంబరరావు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నగర పంచాయతీ కార్మికుల సంఖ్య పెంచాలి

ప్రజాశక్తి -పెనుకొండ

నగర పంచాయతీలో మున్సిపల్ కార్మికుల సంఖ్యను పెంచాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో కమిషనర్ సతీష్ కుమార్‌కు బుధవారం వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ బాబావలి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేష్, రైతు సంఘం ఉపాధ్యక్షులు హరి మాట్లాడుతూ నగర పంచాయతీగా మారిన తర్వాత పట్టణ విస్తీర్ణం, జనాభా పెరిగిందని దానికి అనుగుణంగా కార్మికుల సంఖ్య పెరగలేదని అన్నారు. తక్కువ సంఖ్యతో ఉన్న కార్మికులతో చేయించడం వలన పని భారం పెరిగిందన్నారు. పట్టణాన్ని శుభ్రంగా ఉంచుటకు ఇతర పనులు సులువుగా చేయుటకు ఐదు మంది చేయవలసిన పనిని ఒక్కరే చేయవస్తోందని చెప్పారు. ప్రజలకు తమ బాధలు చెప్పుకొని సంతకాల సేకరించి వినతిపత్రం ద్వారా కమిషనర్ కి తెలియజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, మహబూబ్ బాషా, ఆరిఫ్, గంగాధర్, నరసింహ, వెంకటరాముడు, మున్సిపల్ కార్మికులు వెంకటేష్, సూరి, నరసింహ, ముత్యాలు, లక్ష్మీదేవమ్మ, నరసమ్మ, హెచ్.నరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుదాం

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామ పంచాయతీలలో ఏర్పాటు చేసిన చెత్త సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకుని చెత్తతో సంపదను సృష్టిద్దామని, అన్ని గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చి దిద్దుదామని డివిజన్ పంచాయతీ అధికారి శివ నారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం రూరల్ మండలం తూమకుంట గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన చెత్త సంపద తయారీ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. అన్ని గ్రామాలలోనూ ప్లాస్టిక్ నిషేధ చట్టాన్ని కఠినంగా అమలు చేసి ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కెంచరాయప్ప, క్లాప్ అధికారులతో పాటు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.



చెత్తతో సంపద కేంద్రాన్ని పరిశీలిస్తున్న డివిజన్ పంచాయితీ అధికారి శివ నారాయణ రెడ్డి

పింఛన్లపై విచారణ

ప్రజాశక్తి - పరిగి

మండలంలోని హొన్నంపల్లి, పి. నరసాపురం, పైడేటి, ఎర్రగుంట, శ్రీరంగరాజపల్లి సచివాలయం పరిధిలో గల డిఎం అండ్ హెచ్ఒ పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులను అధికారులు బుధవారం విచారించారు. వైద్య నిపుణులు డాక్టర్స్ స్వాంతన, ఇందురేఖ, నవీన లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి వారికి అందించిన సర్టిఫికెట్లతో పాటు అంగవైకల్యాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి ఆదినారాయణ, వెల్ఫేర్ అసిస్టెంట్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

క్రమశిక్షణతో కూడిన విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

విద్యార్థులు క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసించాలని మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షులు చిన్న తంబి చిన్నప్ప తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని జివిఇ జెడ్పి ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలను నిర్వహించడం జరిగింది. తదుపరి ఈ వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన వారికి మెమెంటోలు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ తల్లం నారాయణమూర్తి, సభ్యులు మనోహర్ గుప్తా, రమేష్, కార్యదర్శి మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి,నల్లచెరువు ప్రాజెక్టు పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్వాడి కార్యకర్తలు, మినీ అంగన్వాడి కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి ఆర్డీవో వెంకట సన్యాసి శర్మ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ప్రాజెక్టుల పరిధిలో మొత్తం 8 పోస్టులకు గాను 31 మంది దరఖాస్తు చేసుకోగా 30 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ పీడీ వరలక్ష్మి, డిప్యూటీ డిఎంహెచ్ఒ నాగేంద్ర నాయక్, సిడిపిఓలు రాధిక, జయంతి తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుపడకపోతే చర్యలు

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురంలో పారిశుధ్యం మెరుగుపర్చకపోతే చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ హెచ్చరించారు. బుధవారం తెల్లవారుజామున పారిశుధ్యకార్మికుల మస్టర్ ను ఆయన పరిశీలించారు. మూడో డివిజన్ కార్యాలయానికి వెళ్లిన చైర్మన్ హాజరు పట్టికలను పరిశీలించారు. పట్టణంలోని అన్ని వార్డుల్లోనూ పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు నిర్వహించి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు శోభన్ రెడ్డి, కౌన్సిలర్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశిబిరం

ప్రజాశక్తి - తలుపుల

మండలంలోని నూతనకాలువ గ్రామంలో దొడ్ల డైరీ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారుజ ముఖ్యఅతిథిగా ప్రొక్యూరిమెంట్ స్టేట్ హెడ్ కే.యుగంధర్ రెడ్డి వెటర్నరీ డాక్టర్ ఏడి ప్రసన్న పాల్గొని పశుపోషణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో యూనిట్ ఇన్‌చార్జిస రవీంద్రనాథ్ ఠాగూర్ , సూపర్వైజర్ శ్రీనివాసుల, టెక్నీషియన్ కె. ఉదయ్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటిక స్థలం అప్పగించండి

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

తమ సామాజిక వర్గం వారికి శ్మశానవాటికకు స్థలం అప్పగించాలని మండల పరిధిలోని ఆకుతోటపల్లి ఎస్సీలు కోరారు. ఈ మేరకు వారు బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రామాచారికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు ఆమట్లాడుతూ ఆకుతోటపల్లిలో మాల సామాజికవర్గం వారికి సర్వేనెంబర్ 594 లో 1-11 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ఆ భూమిలోనే శ్మశానానికి వాడుతున్నామని చెప్పారు. ఇందులో దాదాపుగా 40 సమాధులు ఉన్నాయని ప్రస్తుతం ప్రభుత్వ భూమిలో వాటినిసాగు చేసుకొనుటకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. ధికారులు స్పందించి శ్మశాన వాటికను స్థలాన్ని అప్పగించాలని ప్రజలు కోరారు. ఈ కార్యక్రమంలో బలరాం, పెద్ద ఓబన్న, రంగప్ప, అంజినప్ప, నరసింహులు, చిన్న ఓబులేసు, ఆంజనేయులు, సుజాత, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని కొండూరు గ్రామానికి చెందిన నరసింహ మూర్తి (26)అనే వ్యక్తి ఆర్థిక సమస్యలతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య శోభ తెలిపిన వివరాలు మేరకు.. నరసింహమూర్తి డ్రైవర్ గా పనిచేసుకొంటూ జీవనం సాగిస్తూ ఉండేవాడు. ప్రయివేటు ఫైనాన్స్‌లో రుణం తీసుకొని ద్విచక్ర వాహనం కొనుగోలు చేసాడు. సరిగా ఇఎంఐలు చెల్లించక పోవడంతో ద్విచక్ర వాహనాన్ని తీసుకెళ్లారు. దీంతో మనస్థాపానికి గురైన నరసింహమూర్తి బుధవారం ఊరి చివర ఉన్న చింత చెట్టు కి ఉరి వేసుకొని మృతిచెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు.

ధర్మవరంలో మరో వ్యక్తి ....

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

మండలంలోని నేలకోట తండాకు చెందిన నాగభూషణ నాయక్(50) అనే వ్యక్తి బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన ఇంటిలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు నాగభూషణ నాయక్ వ్యవసాయం చేస్తూ జీవనం చేసేవాడని, అతనికి భార్య, ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారని స్థానికులు తెలిపారు. నాగభూషణ నాయక్ ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సుందని, ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని రూరల్ పోలీసులు తెలిపారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా పోలీసులు వాహనాలు తనిఖీని బుధవారం చేపట్టారు. జిల్లాలో ప్రజల భద్రత, రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసులు విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ప్రతి రోజు సాయంత్రం జిల్లా అంతట విజిబుల్ పోలీసింగ్ లో భాగంగా వాహనాల తనిఖీలు, ఫుట్ పెట్రోలింగ్ చేపట్టారు. ప్రధానంగా రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా గ్రామాలలో పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించారు. గొడవలకు దూరంగా ఉండాలని, పేకాట , సైబర్ నేరాలు గంజాయి , మత్తు పదార్థాలపై కలిగే అనార్థాల గురించి ప్రజలకు వివరించారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి రూరల్ పిఎస్ పరిధిలోని సున్నపుట్ట తండా గ్రామ శివార్లలో పేకాట ఆడుతున్న ఏడుగురుని అరెస్టు చేసినట్లు రూరల్ అప్‌గ్రేడ్ సిఐ నిరంజనరెడ్డి తెలిపారు. నిందితుల నుంచి నాలుగువేల ఇరవై రూపాయల నగదు, పేకముక్కలు తీసుకున్నట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

స్థానిక కదిరి రైల్వే గేటు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రామాదంలో ధర్మవరంలోని శాంతినగర్ కు చెందిన రామసుబ్బయ్య గాయపడ్డాడు. తోపుడుబండిలో చిరువ్యాపారం చేస్తున్న రామసుబ్బయ్య బుధవారం తన ఇంటి వద్ద నుండి తోపుడు బండి తోసుకుంటూ శివానగర్ వైపు వెళుతున్నాడు.కదిరి గేటు రైల్వే గేటు దాటగానే రామసుబ్బయ్యకు వెనుకవైపు నుంచి వస్తున్న జేసీబీ రామసుబ్బయ్యను ఢీకొంది. ఈ ప్రమాదంలో రామసుబ్బయ్య కుడి కాలుకు తీవ్ర గాయమైంది. ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం రామసుబ్బయ్యను అనంతపురం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

తుంపర్తి వద్ద...

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం మండలం తుంపర్తి కాలనీకి చెందిన వెంకటేశు,(60) బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. రేగాటిపల్లి రైల్వే గేటు వైపు నుండి సాయిబాబా గుడి వైపునకు రోడ్డు దాటే క్రమంలో ఆర్ టీ సి బస్టాండ్ వైపు నుండి ఎర్రగుంట వైపునకు వెళ్లే ఒక ద్విచక్రవాహదారుడు వెంకటేష్‌ను ఢీ కొట్టాడు. ఈ ఘటనలో వెంకటేష్ కుడి కాలుకు తీవ్రమైన గాయమైనందున స్థానికులు గమనించి ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. మెరుగైన చికిత్స కోసం వెంకటేశు ను అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వెంకటేష్ చేనేత. కూలి మగ్గం నేస్తాడు.

మంటలు ఆర్పడానికి వెళ్లి వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - లేపాక్షి

ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలను ఆర్పడానికి వెళ్లిన వృద్ధుడు మృతిచెందిన ఘటన మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మాబుసాబ్ (72) పొలం వద్ద ఉన్న ఎండు గడ్డికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. అది గమనించి మాబూసాబ్ మంటలను ఆర్పడానికి వెళ్లాడు. ఈ నేపథ్యంలో మంటల్లో చిక్కుకుని మృతిచెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎస్ఐ నరేంద్ర ఘటనాస్థలాన్ని పరిశీలించారు.

సదరం స్కాంపై విచారణ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో సదరం క్యాంప్ సమయంలో వైద్యులు శ్రీకాంత్ రెడ్డి పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడి సదరం సర్టిఫికెట్లను అందించారన్న ఆరోపణలపై బుధవారం విచారణ చేపట్టారు. జాయింట్ కమిషనర్, రాష్ట్ర సదరం ఇంచార్జ్ డాక్టర్ నాగలక్ష్మి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగలక్ష్మి వైద్యులు శ్రీకాంత్ రెడ్డి తో పలు అంశాలపై విచారణ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సదరం క్యాంప్ సమయంలో డబ్బులు తీసుకొని సర్టిఫికెట్లను అందించారన్నా ఫిర్యాదులపై వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలతో విచారణ చేపట్టామని నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తనతో పాటు బయో మెడికల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సోమేశ్వరరావు పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.

బర్డ్ ఫ్లూ పై అప్రమత్తంగా ఉండాలి

పుట్టపర్తి రూరల్ : తెలుగు రాష్ట్రాల్లో బర్డ్ ఫ్లూ విజృంభిస్తున్న తరుణంలో పశుసంవర్ధక శాఖ రాష్ట్ర డైరెక్టర్ దామోదర్ నాయుడు, వైద్యశాఖ డైరెక్టర్, జిల్లా అధికారులతో విడివిడిగా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి జిల్లాలో నిత్యం ఫారం కోళ్ల రవాణా నిషేధించాలని, కోళ ఫారాలను విజిట్ చేసి పై అధికారులకు ఇచ్చిన సూచనలు పాటించాలని జిల్లాలో ఉన్న డిప్యూటీ డైరెక్టర్లకు సూచనలు ఇవ్వాలని జిల్లా పశుసంవర్ధక శాఖ డిఎహెచ్ఒ శుభదాసు తెలిపారు. అదేవిధంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో జిల్లాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వాటి గురించి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ని ఫిరోజ్ బేగంకు రాష్ట్ర వైద్యశాఖ డైరెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారిని ఫిరోజా బేగం మాట్లాడుతూ జిల్లాలో బర్డ్ ఫ్లూ వ్యాధి వ్యాపించక తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

చీనీతోటల పరిశీలన

ప్రజాశక్తి - తాడిమర్రి

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలో కునుకుంట్ల గ్రామంలో వైరస్ సోకిన చీనీతోటలను జిల్లా ఉద్యాన వన శాఖాధికారి చంద్రశేఖర్, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త రామ సుబ్బయ్య బుధవారం పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఉద్యాన శాఖ అధికారిణి అమరేశ్వరి, తాడిమర్రి వ్యవసాయ అధికారిని రమాదేవి, రైతు సేవా కేంద్రం అధికారులు గౌతమి, జయచంద్ర, రైతులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌కో ఎఇగా సురేంద్ర

ప్రజాశక్తి నల్లచెరువు

నల్లచెరువు మండల విద్యుత్‌శాఖ ఎఇగా సురేంద్ర బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నమయ్య జిల్లా ములకలచెరువు మండల సబ్ ఏఈగా విధులు నిర్వహిస్తున్న ఆయన ఉద్యోగోన్నతిపై నల్లచెరువుకు వచ్చారు. ఇక్కడ ఎఇగా పనిచేస్తున్న వాగ్దేవి కదిరి ఏడీ ఆఫీసుకు బదిలీ అయ్యారు.